క్లుప్తంగా

సైన్స్ పితామహుడు న్యూటన్ వర్ధంతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త ఐజాక్ న్యూటన్ వర్ధంతి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొండపల్లిలో శుక్రవారం నిర్వహించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్స్‌గా పరిణామం చెందేందుకు ఐజాక్ న్యూటన్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆధునిక ప్రపంచం న్యూటన్‌ను సైన్స్ పితామహుడిగా గౌరవిస్తుందన్నారు. న్యూటన్ తన గ్రంథాల్లో గురుత్వాకర్షణ శక్తి గురించి ప్రస్తావించినట్లు తెలిపారు. ఐజాక్ న్యూటన్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శించారు. కొండపల్లి శాఖ అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ సాహెబ్, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



తునికిపాడు(గంపలగూడెం): తునికిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం దాత సహకారంతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు సౌజన్యంతో పాఠశాలలోని 32 మంది విద్యార్థులు జామెట్రీబాక్సులు, పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులకు హాల్ టికెట్లను చావా అందజేసి ఆల్‌దిబెస్ట్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎల్ రామచంద్రరావు, పీఎంసీ చైర్మన్ వేల్పుల రాజీవ్‌గాంధీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

గంపలగూడెం: వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు చెక్కును శనివారం తిరువూరు శాసన సభ్యులు కే రక్షణనిధి అందజేస్తారని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు. కాగా ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు వేరొక ప్రకటనలో కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని గ్రామ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు మోరంపూడి నాగేశ్వరరావు, వంకిణి వెంకటేశ్వరావు, జల్లేపల్లి పరమేశ్వరావు, విస్సంపల్లి రామకృష్ణ, వనమా వాసు, పొగడపూల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ రాయనపాడు ఫీడర్ లైన్ల మరమ్మతుల సందర్భంగా శనివారం 2గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అశోక్‌నగర్, శాంతి నగర్, కల్పతరు ప్లాట్స్, రాయనపాడు, పైడూరుపాడు వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): మండలంలోని తుమ్మలపాలెం గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమం శనివారం ఉదయం, సాయంత్రం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొంటారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారని సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

తిరువూరు, నూజివీడు ఎమ్మెల్యేలు



తిరువూరులో డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధికోసం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. శుక్రవారం తిరువూరు మండలంలోని డ్వాక్రాగ్రూపు మహిళలు, పట్టణంలోని మెప్మా గ్రూపు సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.10 కోట్లు నగదును జమ చేసిన సందర్భంగా ఏఎంసీ ఆవరణలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా అభ్యుదయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కమిషనర్ బాలకృష్ణ, వెలుగు ఏపీఎం గురవయ్య, ఎంపీటీసీ సభ్యులు, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా

ముసునూరు: డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఆర్థిక భవితకు ఆలంబనగా, నిజమైన ఆసరాగా, వైఎస్సార్ ఆసరా పథకం నిలుస్తుందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం డి.రాజశేఖర్ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దువ్వూరి పద్మావతి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడో విడత నమూనా చెక్కు పంపిణీ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 1225 సంఘాలకు చెందిన 12,608 మంది సభ్యులకు మూడో విడత రూ.9,80,91,527ల నగదు జమచేశామన్నారు. కార్యక్రమాల్లో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణ కుమారి, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, వెలుగు సీసీలు, గ్రామైక్య సంఘాల నేతలు, సభ్యులు, స్థానిక కార్యకర్తలు, యువకులు, సచివాలయాల సిబ్బంది, గ్రామాల వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్
- ఈలప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం



ఈలప్రోలులో లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తదితరులు

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం వెల్లువిరుస్తుందని, మంచి చేశాం కాబట్టే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని ఈలప్రోలు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమాన్ని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన ప్రతిపక్ష పార్టీ సానుభూతి పరులకు కూడా వాస్తవం తెలుసన్నారు. జగనన్న పాలన అంటే పేదల మోములో చిరునవ్వులు చిందించడమే అన్నారు. ప్రజల సమస్యలు శ్రద్ధతో ఆలకించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల ద్వారా పెత్తందారీ తనంతో వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థతో మండల కేంద్రానికి కూడా వెళ్లే అవసరం లేకుండా అన్ని పనులు సచివాలయం ద్వారా గ్రామాల్లోనే జరుగుతున్నాయన్నారు. మీకు ఇంతచేస్తున్న సీఎం జగన్‌పై మీరంతా కృతజ్ఞత భావం ఉండాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గ్రామంలోని ఎస్సీ ఏరియాలో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల ప్రజాపరిషత్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వసంత తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, సర్పంచి కరణం రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు కొర్లపాటి జయమ్మ, పార్టీ మండల కన్వీనర్ బొంతా సాంబశివ రావు, గ్రీనరీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పోలగంగు రాణి, దుర్గగుడి కమిటీ సభ్యులు చింతా శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చిన్న రామయ్య, కౌన్సిలర్ నాగరాజకుమారి, పాలడుగు దుర్గాప్రసాద్, చిన్నయ్య పాల్గొన్నారు.

యువతకు అంబేడ్కర్ ఆదర్శం కావాలి

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో కౌన్సిలర్ తలారి ధనలక్ష్మి, సతీష్ దంపతులు, అంబేద్కర్ కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం కోసం పాటుపడిన జాతీయ నాయకులను భావి తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రామిశెట్టి త్రివేణీదుర్గ, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్, కౌన్సిలర్ తలారి ధనలక్ష్మి, నాయకులు సతీష్, బసవా వినయ్, సుగుణరావు, ముల్లంగి జమలయ్య, పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

40 మందికి వైద్య పరీక్షలు



మైలవరం: మైలవరంలోని స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 40 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రవి చంద్ర ఓలేటి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అందరికీ అందుబాటులో ఉండేందుకు మైలవరంలో స్వర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానికంగా క్యాంపు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో చాట్ల వీరాస్వామి, రాజారత్నం, మహేష్ ప్రేమ్ కుమార్ తదితరులు క్యాంపును పర్యవేక్షించారు.

తిరునాళ్ల ఏర్పాట్ల నిర్వహణపై వేలం

విస్సన్నపేట: మండలంలోని పుత్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానం తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా పలు ఏర్పాట్లపై సీల్డ్ కోటేషన్లు ఏప్రిల్ 2వ తేదీలోగా సమర్పించాలని ఆలయ ఈఓ సీతారామయ్య, ఆలయ చైర్మన్ కోటగిరి సునీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విద్యుతు దీపాలంకరణ, మైక్‌సెట్, షామియానా, గ్రామోత్సవాల ఏర్పాటుకు సంబంధించి కొటేషన్లు కోరుతున్నామన్నారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో, ధర్మకర్తల మండలి సమక్షంలో సీల్డ్ కోటేషన్లు తెరుస్తామన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

ఆగిరిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెలుగు ఏపీఎం బొలగాని రామకృష్ణ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరగనున్న ఆసరా కార్యక్రమానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరవుతారని తెలిపారు. మండలంలోని 1237 డ్వాక్రా గ్రూపుల్లోని 12,734 సభ్యులకు రూ.12.56 కోట్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

గుడివాడటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహార విలువలు వివరించి వారికి అవి అందేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సీడీపీఓ విజయ ఫ్లారెన్స్ అన్నారు. స్థానిక సత్యన్నారాయణపురం లోని 425, 426 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్‌లు, చిన్నారులు, సూపర్‌వైజర్‌లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు జ్యోతి, జయంతి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

భవానీపురం(విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ సీపీ శ్రేణులు ముందు మరింత బాధ్యతతో పనిచేసి వారికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, కో ఆర్డినేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం కంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన పారదర్శక పాలన..సంక్షేమం-అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కుల, మత, వర్గాలు పార్టీలకు అతీతంగా, చివరికి మనకు ఓటు వేయని వారికి కూడా అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి కుటుంబానికి తెలియజేయాలన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను చెప్పాలన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల కోసం నిర్మించిన సొంత భవనాలు తద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించాలని సూచించారు. ప్రజా మద్దతు పుస్తకంలో ప్రజల అభిప్రాయాలను నమోదు చేయాలన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించటం, 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పడమట సురేష్ బాబు, ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రఘునాథుడి ఆలయం ముస్తాబు

- ఏప్రిల్ 2న సీతారాముల కల్యాణం
- శ్రీరామనవమి తర్వాత 3 రోజులకు కల్యాణం ఇక్కడ విశేషం
- ఘనంగా ఏర్పాట్లు



గొల్లపల్లిలోని శ్రీరఘునాథస్వామి ఆలయం

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి శ్రీ రఘునాథ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఏప్రిల్ 2న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. శ్రీరామనవమి తరువాత మూడురోజులకు ద్వాదశి రోజున కల్యాణం నిర్వహించడం ఇక్కడ విశేషం. భద్రాచలంలో సీతారాముల కల్యాణం నిర్వహించిన తలంబ్రాలతో ఇక్కడి రఘునాథుడి వివాహం నిర్వహించడం ప్రాచీన కాలంగా వస్తున్న సంప్రదాయం. జమిందారుల ఏలుబడిలో ఉన్న గొల్లపల్లి ఆలయంలో పూర్వ నుంచి శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించేవారు.

మూడో రోజు ఎందుకంటే..

ఆ కాలంలో భద్రాద్రి నుంచి తలంబ్రాలను ఏనుగులపై ఇక్కడకు తీసుకొచ్చేందుకు మూడురోజులు పట్టేది. అందుకే ఇప్పటికి మూడు రోజుల తరువాతనే కల్యాణం నిర్వహిస్తున్నారు. దీంతో ఈనెల 2వ తేదీ రాత్రి 9 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కల్యాణోత్సవాల్లో పాల్గొనేందుకు గ్రామస్తులతో పాటు నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు, గన్నవరం తదితర మండలాల నుంచి తరలివస్తారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుదీపాలతో అలంకరించారు.

ఆలయ చరిత్ర ఇదీ..

గొల్లపల్లిలోని శ్రీ రఘునాథస్వామి ఆలయానికి చారిత్రక ప్రాశస్త్యం ఉంది. వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. వనవాస సమయంలో సీతారాములు కొంతకాలం ఇక్కడే విడిది చేశారని గ్రామస్తులు నేటికి చెబుతుంటారు. ఆనాటి ఆనవాళ్లు నేటికీ మనం కనులారా చూడవచ్చు.

ఆలయానికి 3,600 ఎకరాలు..

ఈ ఆలయానికి 3,600 ఎకరాల విలువైన వ్యవసాయ భూములున్నాయి. ఈ భూముల నుంచి ఆలయానికి కౌలురూపంలో ఆదాయం వస్తుంది. నీటి కోసం శ్రీరాముడు బాణాన్ని సంధించగా ఏర్పడిన బావితో పాటు, ఒక రాతిబండపై రాముల వారు తవ్విన గుంత నుంచి ఇప్పటికి మంచినీరు వస్తూనే ఉంటుంది. ఈ రఘునాథస్వామి ఆలయంలో శ్రీరామనవమికి సీతారాముల కల్యాణం నిర్వహించరు. శ్రీరామనవమి పూర్తయిన తరువాత మూడురోజులకు ఇక్కడ సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

చాట్రాయి: మండలంలోని చనుబండలోని శ్రీ కోదండ రామాలయంలో నవమి వేడుకల సందర్భంగా శుక్రవారం శ్రీ రామ పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి వార్లను ఆలయం నుంచి పల్లకిలో మోసుకుంటూ కల్యాణ మండపంపై ఆసీనులు గావించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు 108 కలశాల్లో పంచామృతాలు పండ్ల రసాలతో కూడిన అభిషేకాలు, నవగ్రహ పూజలు నిర్వహించారు. శ్రీ సుదర్శనం మదన్ శ్రీనివాసాచార్యులు శ్రీ రామ పట్టాభిషేకాన్ని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవ రెడ్డి దంపతులు, ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ దంపతులతో పాటు మరో నలుగురు దంపతుల చేతుల మీదుగా పట్టాభిషేకం గావించారు.

8 వేల మందికి అన్నదానం

చాట్రాయి: మండలంలోని చనుబండలో శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకం సందర్భంగా కోనేరు అభయాంజనేయ స్వామి భక్త భజన మండలి ఆధ్వర్యంలో 8 వేల మందికి అన్నదానం చేశారు. రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సుమారు 2500 మంది మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు.

గాలులకు నేలరాలిన మామిడి కాయలు



గంపలగూడెంలో నేలరాలిన మామిడి కాయలు

గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీ ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. గంపలగూడెం, రాజవరం, పెనుగొలను తదితర గ్రామాల్లో కురిసిన వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. భారీ ఈదురుగాలుల కారణంగా గంపలగూడెంలో మామిడి తోటల్లో కాయలు నేల రాలాయి. ఈ ఏడాది మామిడి కాయల కాపు అరకొరగా ఉండగా ఈదురుగాలుల కారణంగా మరికొంత కాపు రాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని మామిడి రైతు మీసాల సత్యనారాయణ తెలిపారు. పెనుగొలనులో పది ఎకరాల విస్తీర్ణంలో అరటితోటల్లో చెట్లు ఈదురుగాలులతో పడిపోయాయి. ఎకరానికి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని గ్రామానికి చెందిన రైతు జొన్నల ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా తీవ్ర ఉష్ణతాపంతో అల్లాడుతున్న ప్రజానీకం మాత్రం వర్షంతో ఊరట చెందారు.

'జల్‌జీవన్ మిషన్' నిధులు రూ.85.92 లక్షలు మంజూరు

ఎ.కొండూరు: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రజలకు ఇంటింటికి తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఎన్ స్వామినాయక్ శుక్రవారం తెలిపారు. మండలంలోని 8 పనులకు రూ.85,92,000 జల్‌జీవన్‌మిషన్ పథకం నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఎ.కొండూరు తండా రూ.8 లక్షలు, పాత కొండూరు రూ.11లక్షలు, తూర్పు మాధవరం రూ.12.38 లక్షలు, పడమర మాధవరం రూ.13.13లక్షలు, గొల్లమందల తండాకు రూ.8.98 లక్షలు, కృష్ణారావుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని దీప్లా నగర్ తండా రూ.6.38 లక్షలు, చైతన నగర్ తండా రూ.7.50 లక్షలు, రామచంద్రాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటికుంట రూ.18.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి పైపులైన్ లేని ఏరియాలో పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ ట్యాప్‌ల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ప్రస్తుతం కోమటికుంట గ్రామంలో ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి జలజీవన్ మిషన్ పథకం పనులకు శంకుస్థాపన చేశారు. మిగిలిన గ్రామాల్లో త్వరలో పనులు ప్రారంభించి తాగునీరు అందించనున్నట్లు తెలిపారు.

వేణుగోపాలునికి ప్రత్యేక పూజలు



చైర్మన్ రంగారావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న శశిరేఖ

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామిని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్ చైర్మన్ తన్నీరు రంగారావు సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. స్వామి ప్రత్యేక పూజలు పాల్గొన్న అనంతరం రంగారావు దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు ఆశీర్వదించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ ఆయనకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి

వానపాముల(పెదపారుపూడి): అన్నదాతల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని పీఏసీఎస్ అధ్యక్షుడు పల్లా అరవింద్ అన్నారు. మండలంలోని వానపాముల గ్రామంలో పీఏసీఎస్ బ్యాంక్ వద్ద శుక్రవారం సంఘ మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధ్యక్షుడు పల్లా అరవింద్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాతూరి రమేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పుణుకొల్లు శివరామప్రసాద్, రైతులు గోళ్ల రత్తయ్య, పదాలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



గుడ్లవల్లేరు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉత్తరాఖండ్ ఆది శంకర బ్రహ్మ విద్యాపీఠానికి చెందిన స్వామీ ఆత్మ స్వరూప్ అన్నారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కాలేజీలోని నాల్గవ సంవత్సరానికి చెందిన బి.ఫార్మసీ విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం నుంచి 15 రోజుల పాటు ఎన్ఎస్ఎస్ కింద యోగా శిక్షణ సదస్సులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.రవీష, అమలేశ్వరి, ఎన్ఎస్ఎస్ ప్రతినిధి వి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవం తిలకిస్తున్న భక్తులు

గంపలగూడెం: గంపలగూడెం సీతారామస్వామి ఆలయ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. నూతన వధూవరులైన సీతారామచంద్రుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల వెంట అట్టహాసంగా ఊరేగించారు. ముందుగా ఆలయ అర్చకులు దేవయజనం శ్రీధర్ ఆచార్యులు అర్చక బృందంచే విశేష పూజలు జరిపారు. రథోత్సవం ముందు గంపలగూడెంకు చెందిన మహిళలు ప్రదర్శించిన కోలాటం అలరించింది. వైస్ చైర్మన్ కూన కోదండరాం, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం

గోసవీడు(గంపలగూడెం): గోసవీడులో కొత్తకాలనీకి చెందిన గద్దల భూషణం క్యాన్సర్ వ్యాధితో శుక్రవారం మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను కుటుంబ సభ్యులకు సర్పంచ్ కందిమళ్ల ప్రశాంత్, ఉప సర్పంచ్ రత్నంలు మృతుడి భార్య రాణికి అందజేశారు. వైఎస్సార్ సీపీ నేతలు శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ సీతారామయ్య పాల్గొన్నారు.